క్లుప్తంగా

జలజీవన్ మిషన్ పనులు వేగవంతం



పైపులైన్ నిర్మాణం పనులు జరుగుతున్న దృశ్యం

ఎల్.ఎన్.పేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మంగా తీసుకున్న జలజీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలని ఎల్.ఎన్.పేట వైస్ ఎంపీపీ తలసముద్రం కుమారి అన్నారు. తురకపేట సెంటర్‌లో చేపట్టిన పనులు వేగంగా పూర్తి చేసి ఇంటింటికీ తాగునీరు అందివ్వాలన్నారు. ఇప్పటికే రిగ్గుబోరు నిర్మాణంతో పాటు సెంటర్‌లో కొంత వరకు పైపులైన్ వేసే పనులు పూర్తయినట్టు పేర్కొన్నారు. మిగిలిన పనులు త్వరగా పూర్తి చేసి ఇంటింటికీ మంచినీరు అందజేయాలన్నారు.

గడప గడపకు నిధులతో అభివృద్ధి పనులు



కాలువ పనులు జరుగుతున్న దృశ్యం

సారవకోట: అలుదు గ్రామంలో గడప గడపకు నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఎస్సీ వీధిలో మురుగు నీటి కాలువల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం పూర్తయిన తరువాత ప్రభుత్వం రూ. 20 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో ఎస్సీ వీధిలో శిథిలావస్థకు చేరుకున్న కాలువల స్థానంలో కొత్తగా నిర్మాణలు చేపడుతున్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్లకు దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

పొందూరు: రాపాక గ్రామంలో ఉజ్వల స్కీం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని వెంకటసాయి హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ సభ్యులు తెలిపారు. గ్యాస్ కనెక్షన్ కావాల్సిన వారు రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు, రెండు ఫొటోలు అందజేయాలని సూచించారు. దరఖాస్తులను సంస్థ సభ్యులు నారాయణమూర్తి, చిరంజీవి, శ్యామ్‌సుందర్, రవణలు స్వీకరిస్తున్నారు.

పోలీసుల విధులపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై సుధాకర్

హిరమండలం: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా హిరమండలం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. హిరమండలం, సుభలయ గ్రామాలకు చెందిన విద్యార్థులకు పోలీస్ వ్యవస్థ, విధి, విధానాలు, పోలీస్ చట్టం అనే అంశాలపై ఏఎస్ఐ సుధాకర్ అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఎఫ్ఆర్ఐ గురించి వివరించారు. కార్యక్రమంలో పోలీసులు, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలని వినతి



శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కొత్తూరు: తమ సామాజికవర్గం డిమాండ్లను పరిష్కరించాలని తూర్పు కాపు సంక్షేమ సంఘం మండల ప్రతినిధి శెట్టి భానోజీరావు, సభ్యులు కోరారు. ఈ మేరకు తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్‌ను కొత్తూరులో ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు.

మొక్కలు నాటిన విద్యార్థిని



మొక్కలు నాటుతున్న నవ్యశ్రీ

పొందూరు: తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని బొంగు నవ్యశ్రీ తన పుట్టిన రోజు సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆదివారం మొక్కలు నాటింది. పర్యావరణ పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని పేర్కొంది. పర్యావరణ మిత్ర ఉపాధ్యాయుడు పూజారి హరిప్రసన్న పాల్గొన్నారు.

జగన్మాతా కాపాడమ్మా..



జలుమూరు: శ్రీముఖలింగంలో పూజలు అందుకుంటున్న వారాహి అమ్మవారు



జలుమూరు: శ్రీముఖలింగం ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



నరసన్నపేట: చెన్నాపురంలో మహా కనకదుర్గాదేవి అవతారంలో దుర్గాదేవి



నరసన్నపేట: వీఎన్ పురంలో శాకాంబరీదేవిగా అమ్మవారు



ఆమదాలవలస: చిట్టివలసలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు



సారవకోట: అవలింగి నీలమణి ఆలయంలో సింహవాహినిగా నీలమణి అమ్మవారు



సరుబుజ్జిలి: పాతపాడులో అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎస్సై కృష్ణప్రసాద్



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో కుంకుమ పూజల్లో భక్తులు

దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు చివరి దశకు చేరుకున్నాయి. ఆదివారం దుర్గాదేవి మహా కనకదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కొన్నిచోట్ల శాకాంబరీదేవిగా అలంకరించారు. భక్తులు మండపాలు, ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

25 మంది రక్తదానం

సారవకోట: చోడసముద్రం గ్రామంలో ఐక్యత సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 25 మంది యువకులు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. సేవా సంఘం మూడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించగా జెమ్స్ ఆస్పత్రి సిబ్బంది దాతల నుంచి రక్తం సేకరించారు. అలాగే 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దేశాభివృద్ధిలో యువత పాత్ర అనే అంశంపైపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ధర్మాన తేజ, పట్ట ఉమామహేశ్వరరావు, నాగరాజు, నందకిషోర్, సూరపు రమేష్, ఈశ్వరరావు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

అలరించిన యతిరాజ్ హరికథా గానం

కవిటి: మండలంలోని వివిధ గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ముత్యాలపేటలో ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత బొంతలకోట యతిరాజ్ భాగవతార్ ఆలపించిన విరాటపర్వం హరికథా గానం ఆద్యంతం అలరించింది. అంతరించిపోతున్న కళలను పరిరక్షించడంలో కవిటి ఉద్దానం ప్రాంత ప్రజలు చూపుతున్న ఆదరణ అనిర్వచనీయమైనదని ఆయన పేర్కొన్నారు. హరికథా గానానికి వర్ధమాన కళాకారుడు చలపరాయి చాణిక్య మృదంగంతో, చలపరాయి రవి హార్మోనియంతో సహకారాన్ని అందించారు.

ఎమ్మెల్యే దసరా శుభాకాంక్షలు



రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: ప్రజలందరికీ దుర్గాదేవి అనుగ్రహం చేకూరాలని ఆకాంక్షిస్తూ పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. వృత్తి, వ్యాపారాల్లో విజయం సాధించాలని, రైతుల ఇంట సిరిసంపదలు పెరగాలని, పంటలు బాగా పండాలని కోరారు.


28 నుంచి వాల్మీకి జయంతి ఉత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఉపనిషన్మందిరం ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి వాల్మీక జయంతి ఉత్సవాలు జరుగుతాయని, ఈ సందర్భంగా శ్రీమద్రామాయణ ధర్మసంచార ప్రవచనాలు నిర్వహించనున్నట్లు మందిరం అధ్యక్ష, ఉపాధ్యక్షులు గుమ్మా గణేష్, సనపల నారాయణమూర్తిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 28న శ్రీరామ-సీతమ్మ ధర్మసంవాదం, 29న సీతమ్మ-హనుమ ధర్మసంవాదం, 30న శ్రీరామ-భరత, 31న రావణ-మరీచ, నవంబర్ 01న శ్రీరామ-సుగ్రీవ, 2న సీతమ్మ-అనసూయ, 3న సీతమ్మ-రావణ, 4న రావణ-విభీషణ, 5న శ్రీరామ-జాబాలిల ధర్మసంవాదములపై ప్రవచనాలు జరుగుతాయని, సాహిత్యాభిమానులంతా పాల్గొనాలని కోరారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమవుతాయని వెల్లడించారు.

తిరుమలలో శ్రీకాకుళం కళాకారుల ప్రదర్శనలు



శ్రీవారి ఊరేగింపులో మెహెర్ ప్రభాకర్ బృందం ప్రదర్శన



మహతి ఆడిటోరియంలో ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానముల తిరుపతి హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీకాకుళానికి చెందిన మెహెర్ నృత్య కళానికేతన్ వ్యవస్థాపకుడు డి.మెహెర్ ప్రభాకర్, వారి శిష్య బృందం ప్రదర్శనలు ఇచ్చి మన్ననలు పొందారు. శిష్యులు సంధ్య శ్రీప్రతీక, సంహిత, బెహరా ప్రీతి, అనురాధ, వాసంతిలు ఈనెల 21న శ్రీవారి సూర్యప్రభ వాహన సేవలో భరతనాట్య ప్రదర్శన ఇచ్చారని నృత్య దర్శకులు మెహెర్ ప్రభాకర్ తెలిపారు. అలాగే తిరుపతి మహతి ఆడిటోరియంలో ప్రదర్శనలు చేసినట్లు తెలియజేశారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింట్ అయిన శ్రీకాకుళం జిల్లా, కొత్తూరు మండలం, కొత్తూరు గ్రామం వాస్తవ్యులు అయిన ప్రస్తుత నివాసం విశాఖపట్నం జిల్లా, గాజువాక మండలం, కూర్మన్నపాలెం, సైమన్ నగర్, ఫ్లాట్ నెం.303, బాలాజీ హైట్స్, మల్లా లేటు విశ్వనాథం-లక్ష్మి దంపతుల దత్తపుత్రులు అయిన మల్లా శ్రీకాంత్ ఇచ్చిన [illegible] యావన్మంది ప్రజానీకానికి తెలియచేయునది ఏమనగా!

మల్లా లేటు విశ్వనాథం-లక్ష్మీ దంపతులకు పుత్ర సంతానం లేని కారణంగా తన తమ్ముడు అయిన మల్లా మల్లేశ్వరరావు-సులోచన దంపతుల కుమారుడు అయిన నాక్లయింట్ మల్లా శ్రీకాంత్‌ను 10 సంవత్సరాల వయస్సులో ఉండగా సదరు విశ్వనాథం-లక్ష్మీ దంపతులు తే 09-12-1993వ తేదీన దత్తత స్వీకరణ జరిగి నాక్లయింట్‌ను తమ కుమారునిగా స్వీకరించడం జరిగినది. ఈ దత్తతను చట్టబద్ధం గావించుట కొరకు తే 19-03-2008దీలో రిజిస్ట్రార్ ఆఫీసునందు చట్టపరంగా రిజిస్ట్రేషన్ కూడా చేయించడం జరిగినది Vide Doc. No. 2/2008. అది ఇలా ఉండగా నాక్లయింట్ అక్కయ్యలు ఈ దత్తత చెల్లదని, సదరు విశ్వనాథం-లక్ష్మీ గార్ల ఆస్తులన్నింటికి మేమే హక్కుదారులమని వేరెవ్వరికీ హక్కులు లేవని సదరు ఆస్తులను తమ పేరున బదిలీ చేసుకొనుటకు, కమ్మివేయుటకు బలవంతంగా వీలునామా వ్రాయించుటకు ప్రయత్నించుచున్నట్లు నాక్లయింట్‌కు తెలిసి తే 19-03-2008దీలో జరిగిన దత్తత రిజిస్ట్రేషన్ డిక్లేర్ చేయమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రిట్ పిటీషన్ వేయగా శ్రీ కోర్టు వారు రిట్ పిటీషన్ నెం. WP18582/2019 గా ఇవ్వడం జరిగినది. ఈ లోగా సదరు నాక్లయింట్ తండ్రి గారైన మల్లా విశ్వనాథం గారు తే 20-07-2022దీన కాలం చేసితిరి. ఈ రిట్ పిటీషన్ తీర్పు తే 30-08-2023దీన నాక్లయింట్‌కు అనుకూలంగా వచ్చినది. అదే విధంగా FMC No. FAMC012303441243 తే 19-10-2023దీన మండల రెవెన్యూ అధికారి వారు నాక్లయింట్‌ను లేటు మల్లా విశ్వనాథం కుటుంబంలో వారసునిగా ధృవీకరించి, ధృవీకరణ పత్రము జారీచేయడమైనది. మరియు శ్రీకాకుళం జిల్లా కోర్టులో మల్లా లేటు విశ్వనాథం-లక్ష్మీ దంపతులకు సంబంధించిన ఆస్తులపై నాక్లయింట్ సివిల్ దావా వేయడం జరిగినది. IA 420/2022, OS No. 56/2022 పై దావా అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ దశలో ఉన్నది. కావున ఈ ఆస్తుల మీద ఎటువంటి అగ్రిమెంట్లు గాని, విక్రయాలుగాని, తనఖాలుగాని, వీలునామాలుగాని, మ్యుటేషన్లుగాని, బ్యాంక్ లావాదేవీలుగాని జరిగిన యెడల నాక్లయింట్‌కు అవి బంధించవనియు మరియు ఏవిధమైన చర్యలు జరుపరాదనియూ అట్లు జరిపిన అవి చట్టరీత్యా చెల్లనేరవనియూ, అట్లు జరిపిన వారిపైన తగు చట్ట పరమైన సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకొందురనియు యింద్వారాయావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమైనది.

సం/- చిట్టి సూర్యనారాయణ, అడ్వకేట్
బందారి వీధి, బలగ, శ్రీకాకుళం
తేది. 22.10.2023 సెల్: 9866101020

పోటీతత్వం అలవర్చుకోవాలి

వజ్రపుకొత్తూరు రూరల్: విద్యార్థి దశలోనే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ఎస్ఐ మధుసూదన్‌రావు అన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బైపల్లిలో నియోజకవర్గ స్థాయి క్విజ్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో పలాస మండలం బొడ్డపాడు విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవగా, లోహరబందా విద్యార్థులు ద్వితీయ, కాశీబుగ్గ స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు ఎస్ఐ మధుసూదన్‌రావు, ఎంపీటీసీ మడ్డు పరమేశ్వరి, నాయకుడు డొంక విద్యాసాగర్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పూజా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ఎచ్చెర్ల క్యాంపస్: రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ఎచ్చెర్ల ఎస్సై వి.సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు వాహనదారులకు కుశాలపురం బైపాస్ కూడలి వద్ద ఆదివారం అవగాహన కల్పించారు. అతివేగంగా వాహనాలు నడపడం, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని, హెల్మెట్ తప్పని సరిగా వినియోగించాలని, రాంగ్ రూట్ డ్రైవ్ వద్దని సూచించారు.